క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఆలిండియా రేడియో, హైకోర్టు కాలనీ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బాలాపూర్ పోలీసుల కొత్త ఫోన్ నంబర్లు ఇవే..

పహాడీషరీఫ్: మే 1వ తేదీ నుంచి బాలాపూర్ పోలీస్‌స్టేషన్ అధికారుల ఫోన్ నంబర్లు మారనున్నాయని ఇన్‌స్పెక్టర్ బీ భాస్కర్ తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు ఈ నంబర్లను గుర్తుంచుకోవాలని సూచించారు. ఇకపై అధికారులు బదిలీ అయినా, కొత్తగా వచ్చే అధికారులకు కూడా ఇవే నంబర్లు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఇన్‌స్పెక్టర్ బీ భాస్కర్(87126 62366), డీఎస్సై మసియొద్దీన్(87126 62387), సెక్టర్–1 (బాలాపూర్ గ్రామం) ఎస్సై సైదులు (87126 62390), సెక్టర్–2/అడ్మిన్ ఎస్సై(మల్లాపూర్) శ్రీనివాస్ (87126 62392), సెక్టర్–3 ఎస్సై(క్యూబా కాలనీ) మహేందర్ (87126 62394), సెక్టర్–4 ఎస్సై(షాహీన్‌నగర్) జానీ (87126 62388), సెక్టర్–5(ఉస్మాన్‌నగర్) ఎస్సై శ్రీకాంత్ (87126 62391).

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



రాములుకు చెక్కు అందజేస్తున్న మంత్రి సబితారెడ్డి

పహాడీషరీఫ్: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందిన వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఆసరాగా ఉంటుందని మంత్రి సబితారెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపల్ శ్రీరాం కాలనీకి చెందిన రాములు అనారోగ్యానికి గురయ్యాడు. సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకొని బీఆర్ఎస్ స్థానిక నాయకుడు ఏ అర్జున్ సహకారంతో మంత్రికి అర్జి పెట్టుకున్నాడు. మంత్రి సిఫారసు మేరకు రూ. 35 వేలు మంజూరైంది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును ఆదివారం మంత్రి సబితారెడ్డి లబ్ధిదారు రాములుకు అందజేశారు.

ఆలయ పునఃనిర్మాణ పనులకు భూమిపూజ



ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న వరప్రసాద్‌రెడ్డి

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని గుడితండాలో ఆదివారం శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ పునఃనిర్మాణ పనులకు ఐక్యతా ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఆలయ పునఃనిర్మాణానికి ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సహకారం అందిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేడిగడ్డతండా ఉపసర్పంచ్ మల్లేశ్, స్థానికులు తావుర్య, చందు, లోక్య, పత్యా, వెంకటయ్య, ఫౌండేషన్ సభ్యులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ

మంచాల: మండల పరిధిలోని బోడకొండలో సీసీరోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ నర్మద ఆదివారం ప్రారంభం చేశారు. ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.25లక్షలతో రోడ్డు పనులు చేపట్టినట్లు తెలిపారు. ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి సహకారంతో మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల యువజన విభాగం అధ్యక్షుడు, ఉప సర్పంచ్ వనపర్తి భద్రీనాథ్ గుప్తా, ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్ అందజేత

తలకొండపల్లి: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఖానాపూర్‌లో ఆదివారం ఫౌండేషన్ సభ్యులచే క్రీడాకారులకు క్రికెట్‌కిట్, క్రీడా మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు నూనె రాఘవేందర్, భరత్, నరేందర్, శివ, విజయ్, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

'మన్‌కీబాత్'తో ఎన్నో మార్పులు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి



మహేశ్వరం: మన్‌కీబాత్ కార్యక్రమంలో నర్సింహారెడ్డి తదితరులు

మహేశ్వరం: ప్రధాని మోదీ మన్ కీ బాత్ కార్యక్రమం సమాజంలో ఎన్నో మార్పులకు శ్రీకారం చుట్టిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని మన్సాన్‌పల్లి చౌరస్తాలో బీజేపీ పెండ్యాల శక్తి కేంద్రం ఆధ్వర్యంలో మన్ కీ బాత్ 100వ ఎపిసోడ్ సందర్భంగా ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు ప్రధాని ప్రసంగం వినిపించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. 2014 విజయ దశమి రోజున ఈ కార్యక్రమాన్ని మోదీ మొదలు పెట్టారన్నారు. ప్రజలు మన్ కీ బాత్‌లో భాగస్వాములు అయ్యారని పేర్కొన్నారు. కేంద్రం ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మన్ కీ బాత్‌లో చర్చిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం పాలనను ప్రజలకు మరింత చేరువ చేసిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం సుదర్శన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఏ యాదయ్య గౌడ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు టీ యాదిష్, గిరిజన మోర్చా సీనియర్ నాయకులు దేశ్యా నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు మాధవాచారి, పెండ్యాల శక్తి కేంద్రం ఇన్‌చార్జ్‌లు బీ శంకర్, డీ సుదర్శన్, ఎం కరుణాకర్, పార్టీ సీనియర్ నాయకులు కే సామయ్య, ఉపేందర్, మల్లేష్ దర్శన్, రవీందర్, శేఖర్, రెడ్యాల తదితరులు పాల్గొన్నారు.

వీక్షించిన బీజేపీ శ్రేణులు

తుక్కుగూడ: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ 100 ఎపిసోడ్ మన్‌కీ బాత్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ పరిధిలోని బీజేపీ శ్రేణులు వీక్షించారు. కార్యకర్తలు కోసం పార్టీ నాయకులు బూత్‌ల వారీగా ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి టీ వీరేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. మన్‌కీ బాత్ కార్యక్రమం ద్వారా ప్రధాన మంత్రి ప్రజలకు సందేశాలు ఇవ్వడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మీర్‌పేటలో..

మీర్‌పేట: ప్రధాని మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ సాయినగర్‌లో బీజేపీ స్థానిక నాయకులు వీక్షించారు. ఈ సందర్భంగా పార్టీ ప్రధాన కార్యదర్శి జీ మధు మాట్లాడుతూ.. దేశ ప్రజల మనసులోని మాటలను నేరుగా పంచుకునేందుకే ప్రధాని మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని చేపట్టారని, ఈ కార్యక్రమం వందవ భాగాన్ని వీక్షించడం సంతోషంగా ఉందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో ముందుకెళ్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహ యాదవ్, కాశీరాం యాదవ్, మల్లికార్జున్, డీ మహేష్, శ్రీకాంత్, పుష్ప, శోభారాణి, ఆర్య, రాజు తదితరులు పాల్గొన్నారు.



తుక్కుగూడ: ఇమామ్‌గూడలో మన్‌కీబాత్‌ను వీక్షిస్తున్న బీజేపీ నాయకులు



మీర్‌పేట: జిల్లెలగూడలో మన్‌కీబాత్‌ను వీక్షిస్తున్న బీజేపీ నాయకుడు మధు తదితరులు

ఈ మలుపు.. ప్రమాదాలకు పిలుపు

పహాడీషరీఫ్: ఆర్‌సీఐ రహదారిలోని మూల మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఏరో సిటీ, సుల్తాన్‌పూర్ పెట్రోల్ పంప్ మధ్యలో ఉన్న ఈ ప్రధాన మూల మలుపుతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. పహాడీషరీఫ్ నుంచి మల్లాపూర్ వెళ్లే ఈ మార్గంలో గతంలో గోతులమయంగా ఉన్న రహదారి కారణంగా వాహనాల రాకపోకలు తక్కువ సంఖ్యలో కొనసాగేవి. కానీ నూతనంగా బీటీ రోడ్డు వేయడంతో జిల్లాల నుంచి నగరానికి వెళ్లే వాహనదారులంతా ఈ మార్గాన్ని ఎంచుకుంటున్నారు. నిత్యం వేల సంఖ్యలో వాయు వేగంతో వెళుతున్న వాహనదారులు ఈ మూల మలుపు వద్దకు చేరుకోగానే ప్రమాదాల బారిన పడుతున్నాయి. ముఖ్యంగా ఈ రూట్‌లో కొత్తగా వచ్చే వాహనదారులు అకస్మాత్తుగా వచ్చే మలుపును గమనించలేని పరిస్థితి నెలకొంటుంది. పెద్ద ఎత్తున చెట్లు సైతం రోడ్డుకిరువైపులా పెరగడంతో సమస్య మరింత జఠిలంగా మారింది. సమస్యను దృష్టిలో ఉంచుకొని ఈ మలుపు వద్ద స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేసి ప్రమాదాలను అరికట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



ఆర్‌సీఐ రహదారిలో ప్రమాదకర మలుపు

పొదుపు.. ఆర్థిక ప్రగతికి అడుగు

కౌన్సిలర్ లక్ష్మీనారాయణ

పహాడీషరీఫ్: చిన్న మొత్తాల పొదుపు ఆర్థిక ప్రగతికి అడుగని జల్‌పల్లి మున్సిపల్ 18వ వార్డు కౌన్సిలర్ కే లక్ష్మీనారాయణ అన్నారు. శ్రీరాం కాలనీ శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి పొదుపు సంఘం 18వ వార్షికోత్సవం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు భక్త మార్కండేయ స్వామి వార్ల పూజతో పాటు నూతన భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ.. శ్రీరాం కాలనీ ప్రజలు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ సొంత కాళ్లపై నిలబడుతున్నారని అన్నారు. నెల నెలా పొదుపు చేసుకుంటూ అవసరమైన సమయంలో వినియోగించుకునేందుకు సంఘాలు ఏర్పాటు చేసుకోవడం జరుగుతోందన్నారు. సంఘం నూతన అధ్యక్షుడిగా మన్న రవి కుమార్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు, కాలనీ వాసులు జీ శ్రీనివాస్, వెంకటేష్, తిరుపతయ్య, ధన్‌రాజ్, శ్రీకాంత్, శ్రీనివాస్, సంగీత, విష్ణు, భిక్షపతి, రాఘవేందర్, బోడ హరికృష్ణ, నామని కృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న సంఘం సభ్యులు

అవినీతి ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయాలి



బాలాపూర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

- ఎమ్మార్పీఎస్ నేతల డిమాండ్
- బాలాపూర్ చౌరస్తాలో ధర్నా
- హైకోర్టు సుమోటోగా తీసుకోవాలని వినతి

మీర్‌పేట: దళితబంధు పథకంలో అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం బాలాపూర్ చౌరస్తాలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ బాలాపూర్ మండల ఇన్‌చార్జ్ టీ శ్రీనివాస్ మాదిగ మాట్లాడుతూ.. దళితబంధులో రూ. 2 నుంచి 3 లక్షల వరకు కమీషన్ తీసుకున్న 30 మందికి పైగా ఎమ్మెల్యేల వివరాలు నా దగ్గర ఉన్నాయని స్వయానా ముఖ్యమంత్రి మీడియా సాక్షిగా చెప్పారని అన్నారు. అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేల పేర్లు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. హైకోర్టు ఈ కేసును సుమోటోగా తీసుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు బీ రవి మాదిగ, కోకన్వీనర్ సురేష్ మాదిగ, చిన్నా మాదిగ, జే ఇంద్ర మాదిగ, జంగయ్య మాదిగ, ఆనంద్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల రాకతో యువతకు ఉపాధి

బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు జగదీశ్వర్

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర యువత బీఆర్ఎస్ వెంటే ఉందని బీఆర్ఎస్వీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షుడు నిట్టు జగదీశ్వర్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కర్ణంగూడలో పార్టీ యువజన, విద్యార్థి విభాగాల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. ఐటీ, పరిశ్రమల రాకతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ఈనెల 9న చేపట్టబోయే యువ సమ్మేళనానికి అధిక సంఖ్యలో యువత తరలిరావాలని పిలుపునిచ్చారు. ఆ పార్టీ నాయకులు సుధాకర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, శ్రీరామ్, శ్రీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు చెక్కుల పంపిణీ

యాచారం: ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి యాచారం మండల పర్యటనకు వస్తున్నట్లు తహసీల్దార్ సుచరిత తెలిపారు. మండల కేంద్రంలోని సాయి శరణం ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఉదయం 11 గంటలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని ఆమె తెలిపారు. మండలంలోని 24 గ్రామాల్లోని 117 మంది లబ్ధిదారులకు చెక్కులు వచ్చినట్లు తెలిపారు. లబ్ధిదారులు ఫంక్షన్ హాల్‌కు సకాలంలో వచ్చి చెక్కులు పొందాలని సూచించారు.

ఆర్థిక సాయం అందజేత

కడ్తాల్: మండల పరిధిలోని చరికొండ గ్రామానికి చెందిన నీలాల మంగ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని ఆదివారం స్వామి వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు తాటిపర్తి ఈశ్వర్‌యాదవ్ పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. అదే విధంగా కొన్నిరోజుల క్రితం మృతి చెందిన అమడెల్లి కుటుంబ సభ్యులను పరామర్శించి బాధిత కుటుంబానికి క్వింటాల్ బియ్యం అందించారు. కార్యక్రమంలో నాయకులు కె.యం.గౌడ్, రామకృష్ణ, శ్రీశైలం, గిరి, జగన్, తిరుపతయ్య, వెంకటేశ్, పవన్ తదితరులు ఉన్నారు.

క్రీడలతో ఆరోగ్యం పదిలం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న నర్సింహారెడ్డి తదితరులు

కందుకూరు: క్రీడలతో స్నేహ భావం పెంపొందుతుందని బడంగ్‌పేట్ మాజీ వైస్ చైర్మన్ సీ నర్సింహారెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని ఊట్లపల్లిలో కే బాలకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ లీగ్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ క్రీడలను ప్రోత్సహించాలన్నారు. చిన్నతనం నుంచే తల్లిదండ్రులు తమ పిల్లలు క్రీడల్లో పాల్గొనేలా చూస్తే వారి భవిష్యత్ ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఆర్ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ అఫ్జల్‌బేగ్, పార్టీ మాజీ యూత్ ప్రెసిడెంట్ డీ శ్రీధర్ ముదిరాజ్, సీనియర్ నాయకులు సీ మల్లేష్, బీ పాండురంగారెడ్డి, వీ నారాయణ, ఎం శేఖర్, బీ శ్రీనివాస్‌రెడ్డి, కే రమేష్, బీ కృష్ణ, బీ దర్శన్, ఎం రవి పాల్గొన్నారు.

ఘనంగా పోతులూరి ఆరాధనోత్సవాలు



హోమం చేస్తున్న భక్తులు

కందుకూరు: మండలంలోని ఆకుల మైలారంలో శ్రీ విరాట్ పోతులూరి వీర బ్రహ్మంగారి 330వ ఆరాధన పూజా కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పూజలతో పాటు హోమం నిర్వహించి పూర్ణాహుతి చేశారు. సర్పంచ్ కలమ్మ రాజు, ఎంపీటీసీ పద్మ పాండు, ఉప సర్పంచ్ రాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, రైతు బంధు కన్వీనర్ కృష్ణ రాంభూపాల్‌రెడ్డి, విశ్వకర్మ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెన్నయ్యచారి తదితరులు హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు వెంకటాచారి, ఉపాధ్యక్షుడు శేఖర్‌చారి, కోశాధికారి రమేష్‌చారి, సంఘం నాయకులు కాశిదాస్‌చారి, చంద్రమోహన్‌చారి, శివ, ఆచారి, విష్ణుమూర్తి, నరేందర్, జగన్‌చారి, నరసింహాచారి, కృష్ణాచారి, సత్యం, తిరుపతిచారి పాల్గొన్నారు.

నూతన వధువుకు పెళ్లికానుక



వధువుకు పెళ్లికానుక అందిస్తున్న సత్యం

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం శెట్టిపల్లి గ్రామంలో వివాహం చేసుకోబోయే ఆడపడుచులకు పెళ్లికానుక అందించి అండగా ఉంటామని శెట్టిపల్లి సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి, మండల బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు ఎగిరిశెట్టి సత్యం అన్నారు. శెట్టిపల్లి గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైనప్పటి నుంచి ఎగిరిశెట్టి గోదాదేవి, సత్యం దంపతులు గ్రామంలో వివాహం చేసుకోబోయే అమ్మాయిలకు రూ.10116 చొప్పున పెళ్లికానుకగా అందిస్తున్నారు. అందులో భాగంగా శెట్టిపల్లి గ్రామానికి చెందిన కళమ్మ, వెంకటయ్య దంపతుల కుమార్తె అనూష వివాహం సందర్భంగా ఆదివారం ఎగిరిశెట్టి సత్యం రూ.10116 అందించారు. ఇప్పటివరకు 58 మంది ఆడపడచులకు పెళ్లి కానుక అందించినట్లు చెప్పారు.స్థానిక నాయకులు బాలయ్య, చంద్రమౌళి, అర్జున్‌రావ్, యాదయ్య, శ్రీను, జగన్, రాము తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులు నమోదు చేయండి

ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ శ్రేణుల నిరసన



యాచారం: అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

యాచారం: దళితబంధు పథకంలో లబ్ధిదారుల వద్ద లంచాలు తీసుకున్న ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ శ్రేణులు డిమాండ్ చేశాయి. దళితబంధు పథకంలో అక్రమాలు జరిగాయని స్వయంగా సీఎం కేసీఆరే ప్రకటించిన దృష్ట్యా వెంటనే బాధ్యులైన ఎమ్మెల్యేలను తొలగించడంతో పాటు వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం యాచారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరాస్తాలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ కృష్ణ, మండల అధ్యక్షుడు కొమ్ము మహేష్, నాయకులు లింగం, శ్రీకాంత్, యాదయ్య, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సుమోటోగా స్వీకరించాలి..

తలకొండపల్లి: దళితబంధు పథకంలో ముడుపుల వ్యవహారాన్ని న్యాయస్థానం సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కిరణ్‌పూలే డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కిరణ్‌పూలే ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ సంఘాల నేతలు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ మండలాధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు నారాయణ, కిరణ్, ప్రహ్లాద, శివ, రాజు, సురేష్, ఉపేందర్, అనిల్, సందీప్, సన్ని, తదితరులు పాల్గొన్నారు.

'తెలంగాణ భరోసా' వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



ఆమనగల్లు: వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నేతలు

ఆమనగల్లు: హైదరాబాద్‌లో మే 7న బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ భరోసా సభను విజయవంతం చేయాలని బీఎస్పీ కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్ము శ్రీనివాస్ యాదవ్ కోరారు. పట్టణంలో ఆదివారం బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ భరోసా సభ వాల్‌పోస్టర్లను స్థానిక నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల హామీలను విస్మరించిందని ఆరోపించారు. రాష్ట్రంలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని ఆయన కోరారు. మే 7న నిర్వహిస్తున్న తెలంగాణ భరోసా సభకు ముఖ్యఅతిథిగా బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి హాజరవుతున్నారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కుమార్, ఉపాధ్యక్షుడు కుమార్, సోషల్ మీడియా కన్వీనర్ శ్రీకాంత్, నాయకులు జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కొంగర్‌కలాన్‌లో..

ఇబ్రహీంపట్నం రూరల్: బీఎస్పీ ఆధ్వర్యంలో మే 7న సరూర్‌నగర్ స్టేడియంలో జరగబోయే తెలంగాణ భరోస సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆదివారం ఆదిబట్ల పరిధిలోని కొంగరకలాన్ అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆ పార్టీ నేతలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు మహేందర్, మున్సిపల్ కార్యదర్శి జోగుస్వామి, బూత్ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, నాయకులు భాస్కర్, గణేష్, రమేష్, కృపాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కన్యకాపరమేశ్వరి జయంతి



వాసవీ మాతకు ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తజనం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలో శ్రీవాసవీ మాత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం వాసవీ కాలనీ ఆధ్యాత్మిక కేంద్రంలో కాలనీ సంక్షేమ సంఘం, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీ కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో జయంతి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మ్యాడం మదన్‌మోహన్ గుప్తా, చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంపాపేట్‌లో...

చంపాపేట: శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలను ఆదివారం చంపాపేటలోని బీవీబి ధామం వివాహ మందిరంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మధుసూదన్‌రెడ్డిని ఉత్సవ నిర్వాహకులు శాలువలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు సాయిరాం, గీతాదేవి తదితరులు పాల్గొన్నారు.

లింగోజి గూడలో..

లింగోజిగూడ: వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం లింగోజిగూడ డివిజన్ పరిధిలోని పటేల్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం కుంకుమార్చన, మంగళ హారతి నిర్వహించారు. అనంతరం అమ్మవారి చీర, రాగి చెంబులను వేలంపాట నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ, నాగబండి రాములు గుప్తా, అనంత రవి, ఆకుల సమాకాంత్, లింగేష్ గుప్తా, బిల్లకంటి కిరణ్ కుమార్, నారాయణ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

వనస్థలిపురం: ఆర్యవైశ్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వనస్థలిపురం ద్వారకామయినగర్‌లో శ్రీ వాసవీ మాత జయంతి ఉత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ గుప్త దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, సంఘం అధ్యక్షులు ఏ.బాలకృష్ణ, ఉపాధ్యక్షులు ఎం.మురళి, ఏ.శ్రీధర్, సుధాకర్, ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీశైలం, గణేష్‌కుమార్, వెంకటేశ్వర్లు, జగన్నాథ్ పాల్గొన్నారు.